క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరులో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు నరేన్ రామాంజుల్‌రెడ్డిలు పాల్గొంటారని మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. సర్పంచులు, ఎంపీటీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మొక్కలు నాటే కార్యక్రమం

ఎర్రగుంట్ల : పట్టణంలో గురువారం మొక్కలు నాటే కార్యాక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డిలు పాల్గొంటారని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి వెంబడి ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ అధికార యంత్రాంగం పాల్గొనాలని ఆయన కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

లింగాల : మండలంలోని బోనాల, పెద్దకుడాల గ్రామాల్లో బుధవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలతో ఓటర్ల నమోదు కార్యక్రమాలపై చర్చించారు. ఓటర్ల నమోదు, తొలగింపులపై తీసుకోవాల్సిన చర్యలపై బీఎల్‌ఓలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సురేంద్ర, వీఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

18న సీజ్ చేసిన వాహనాలకు వేలం పాట

జమ్మలమడుగు : అక్రమ మద్యం రవాణా చేస్తూ పట్టుబడి సీజ్ చేసిన వాహనాలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన వారు ఆధార్ కార్డుతో పాటు ఏదైన గుర్తింపు కార్డుతో వచ్చి వేలం పాటలో పాల్గొన వచ్చునన్నారు.

సమగ్ర భూ రీసర్వే నిర్వహించాలి

వేంపల్లె : మండల వ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో రీసర్వేకి సంబంధించి రికార్డులను పరిశీలించారు. అలాగే జగనన్న కాలనీల్లో ఎంత మేర ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా భూ రీసర్వేను చేపట్టాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ శివారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మును తొలగించండి



మైలవరం దక్షిణ కాలువను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఎర్రగుంట్ల : మైలవరం దక్షిణ కాలువలో పేరుకుపోయిన జమ్మును తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. బుధవారం ఆయన మండల పరిధిలో ఉన్న మైలవరం దక్షిణ కాలువను పరిశీలించి మాట్లాడారు. రాయలసీమను శాశ్వతంగా కరువు నుంచి విముక్తి చేసేందుకు ఆగిపోయిన ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సభ్యులు కేసీ బాదుల్లా, వి.గంగాసురేష్ పాల్గొన్నారు.

అంతరాయంలేకుండా విద్యుత్ అందించాలి



సబ్‌స్టేషన్‌ను తనిఖీచేస్తున్న ఎస్‌ఈ, సిబ్బంది

ముద్దనూరు : వినియోగదారులకు అంతరాయంలేకుండా నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని ఉప్పలూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎస్‌ఈ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మట్లాడారు. ప్రమాదకరంగా వున్న విద్యుత్ స్తంభాలను తక్షణమే సరిచేయాలని, ట్రాన్స్‌ఫారంల వైఫల్యాలను నియంత్రించాలని, అవసరమైతే కొత్త వాటిని ఏర్పాటుచేయాలని, పగటిపూట వీధిలైట్లు వెలగకుండా చూడాలని, విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఈలు శ్రీనివాసులరెడ్డి, సుబ్రహ్మణ్యం, శేషగిరిబాబు, ఏఈ వర్మలు పాల్గొన్నారు.

పోషకాల డ్రాగన్ పండు - లాభాలు మెండు



చిన్న దుద్యాల వద్ద సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ తోట



చేతికొచ్చిన పండ్లతో డ్రాగన్‌సాగు

ముద్దనూరు : పోషకాల నిధిగా, ఆరోగ్యానికి పెన్నిధిగా ఎర్రటి రంగుతో నోరూరిస్తూ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన పండు 'డ్రాగన్‌ఫ్రూట్'. కొద్దికాలంక్రితం వరకు అరుదుగా సాగులో కనిపించే ఈ పంట ప్రస్తుతం అందరికీ అందుబాటులోకి వచ్చింది. మండలంలోని చిన్నదుద్యాల గ్రామంలో తండ్రీకొడుకులు 2 ఎకరాలలలో మొదటిసారిగా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేసి సత్ఫలితాలను సాధిస్తున్నారు. దీర్ఘకాలం సాగులో వుండే ఈ పంట ఇతర పంటల సాగుతో పోల్చితే వ్యవ ప్రయాసలు తక్కువే. అయితే సాగులో కొన్ని మెలకువలు పాటిస్తే మార్కెట్‌లో భారీగా లాభాలను ఆర్జించవచ్చని సాగు చేసిన రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న చిన్నదుద్యాలకు చెందిన బోరెడ్డి హరినాథరెడ్డి సామాజిక మాధ్యమాల ద్వారా పంటసాగుపై అవగాహన పెంచుకుని, తన తండ్రి లక్ష్మిరెడ్డి, సోదరుడు ప్రసాద్‌రెడ్డిలతో కలిసి 2 ఎకరాలలో డ్రాగన్ పంటను సాగుచేశారు. విజయవాడ పరిసరప్రాంతాలనుంచి డ్రాగన్ మొక్కలను తెచ్చి, డ్రిప్ సౌకర్యంతో 1 ఎకరాకు సుమారు 2000 మొక్కలను నాటి పంటను సాగుచేసినట్లు వారు తెలిపారు. రైతులు నాణ్యమైన మొక్కలను తెచ్చుకుని వాతావరణం అనుకూలంగా వున్నప్పుడు నాటితే కేవలం 8 నెలల కాలంలోనే డ్రాగన్ ఫలాలు చేతికొస్తాయని, మొదటి ఏడాది అరటన్ను నుంచి 1 టన్ను వరకు దిగుబడి వస్తుందని సాగురైతులు తెలిపారు. 2వ ఏడాదినుంచి పంట దిగుబడి 3 టన్నులనుంచి ఇంకా పెరుగుతుందని, మార్కెట్‌లో ఈ పండుకు మంచి ధర వుందని, ప్రస్తుతం 1 టన్ను విలువ రూ.1 లక్షా 20 వేల వరకు విక్రయిస్తున్నట్లు రైతు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. డ్రాగన్ ఫ్రూట్ సాగులో ఇతర పంటల లాగా రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం చాలా తక్కువని, ఈ సాగులో పండ్లు చెట్టుకే మాగుతాయని యాజమాన్య పద్ధతులు, సలహాలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వారు తెలిపారు.

డ్రాగన్ మొక్క ఎంపికే కీలకం



డ్రాగన్ ఫ్రూట్ సాగులో మొదటగా మొక్కలను తెచ్చి నాటాల్సివుంటంది. ఈ పంట సాగులో నాణ్యమైన మొక్కను తెచ్చుకోవడమే కీలకం. మంచి దిగుబడి వున్న డ్రాగన్ సాగులోని మొక్కను తెచ్చుకుంటే మంచి ఫలితాలు వుంటాయి. నాణ్యమైన డ్రాగన్‌ఫ్రూట్ 300-600 గ్రాముల బరువు వుంటుంది.

–బోరెడ్డి హరినాథరెడ్డి, రైతు, చిన్న దుద్యాల.

నీటివినియోగం,పెట్టుబడి తక్కువ



ఇతర పంటల లాగా కాకుండా డ్రాగన్ ఫ్రూట్ సాగుకు నీటి నియోగం,పెట్టుబడులు చాలా తక్కువ.సహజసిద్ధమైన సత్తువలు ఉపయోగిస్తే మంచిది.ఒకసారి పెట్టుబడి పెడితే చాలు.మార్కెటింగ్ కూడా సులువు, డిమాండ్ వుండడంతో తోట వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారు.

–ప్రసాద్‌రెడ్డి,డ్రాగన్‌సాగు రైతు,చిన్నదుద్యాల.

మాలెపాడులో 24 మందిపై బైండోవర్

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో శ్రీరామ గుడి విషయంపై ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్తలు కోసం 24 మందిపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు కలమల్ల ఎస్‌ఐ సంజీవరెడ్డి బుధవారం తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీర్లు

ఎర్రగుంట్ల : ఏపీఎస్‌బీ ఇంజనీర్స్ అసోసియేషన్, ఏపీఎస్‌ఈబీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల అసోసియేషన్‌ల పిలుపు మేరకు బుధవారం ఆర్టీపీపీలో విద్యుత్ ఇంజనీర్లు నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. విద్యుత్ ఇంజనీర్‌లకు నష్టం చేకూర్చే విధంగా ఉన్నటువంటి పీఆర్‌సీ-2022ను వ్యతిరేకిస్తున్నట్లు వారు తెలిపారు. మహిళా ఇంజనీర్లు ఈ నిరసనలో పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963 170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

లోన్ యాప్స్ మాయలో పడి మోసపోవద్దు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ పెద్దఓబన్న

వల్లూరు : ప్రజలు లోన్ యాప్స్ మాయలో పడి మోసపోవద్దని ఎస్‌ఐ పెద్దఓబన్న సూచించారు. మండలంలోని చిన్న లేబాక గ్రామాన్ని బుధవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో కలిసి సందర్శించారు. స్థానిక ప్రజలతో గ్రామ సభను నిర్వహించి సైబర్ నేరాలు, ఓటీపీ ఫ్రాడ్ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సులభంగా అప్పు లభిస్తుందని ఫేక్ లోన్ యాప్‌ల వలలో చిక్కుకోవద్దని, చిన్న మొత్తంలో అప్పు ఇచ్చి మీ నుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు చెల్లించేలా మోసగాళ్లు బెదిరించడం వంటి చర్యలతో మానసిక క్షోభకు గురిచేస్తారని హెచ్చరించారు. అనధికారి లోన్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసే సమయంలో మీయొక్క కాంటాక్ట్స్, మీడియా, గ్యాలరీలకు సంబంధించిన ఎటువంటి పర్మిషన్లు ఇవ్వవద్దన్నారు.

నేటి నుంచి ప్రతిష్టా మహోత్సవం



శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయం

పులివెందుల టౌన్ : పట్టణంలోని కడప రోడ్డులో ఉన్న ఆర్‌ఆర్ లే అవుట్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకార్యసిద్ధి ఆంజనేయస్వామి, శ్రీగణేశ ధ్వజ శిఖర కలశ ప్రతిష్టా మహోత్సవం నేటి నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ వారు తెలిపారు. 17వ తేదీన గురువారం గణేశ ప్రార్థన, గంగ గోపూజ, స్వస్తివాచనం, పంచగవ్యం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, హోమాలు, జలాధివాసం తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. 18వ తేదీన ఉదయం ప్రాతఃకాల పూజ, శ్రీసీతారామ హనుమత్ గణేశ మూలమంత్ర, హోమాలు తదితర పూజాది కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19వ తేదీన ఉదయం పంచాంగ కర్త రామ్‌కుమార్ శర్మచే కార్యసిద్ధి ఆంజనేయస్వామి, గణేశ ధ్వజ శిఖర కలశ జౌష్ట వాన ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ మూడు రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు విక్రయించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం కమలాపురం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఎరువుల రికార్డులను, దుకాణంలో ఉన్న నిల్వలను, ఈ-పోస్ యంత్రంలో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్ రిజిష్టర్‌లో వ్యత్యాసం లేకుండా చూసుకోవాలన్నారు. ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలన్నారు. అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి దుకాణంలో స్టాక్ బోర్డు, ఎరువుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. ఈఏఓ దస్తగిరి, ఎరువుల దుకాణాదారులు పాల్గొన్నారు.

ముద్దనూరు : మండల పరిధిలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను వ్యవసాయాధికారులు బుధవారం తనిఖీ చేశారు. మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డిలు దుకాణాల్లోని స్టాకును పరిశీలించి అనుమతి పత్రాలు లేని రూ.1లక్షా30వేల ఎరువులు, రూ.1లక్షా52వేల పురగుమందుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏవో తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై బుధవారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు నిర్మించే విధంగా చూడాలన్నారు. జగనన్న కాలనీల నిర్మాణ పనులు కూడా త్వరగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలన్నారు. అలాగే మండలాల పరిధిలోనూ, మున్సిపాలిటీలను సచివాలయాల పనితీరు ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకరావాలన్నారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర, నా భూమి నా దేశం పథకాల పనితీరు గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



పాఠశాలకు కంప్యూటర్‌ను అందిస్తున్న దాతలు

తొండూరు : మండల పరిధిలోని అగడూరు ఉన్నత పాఠశాలలో 7,8,9వ తరగతులలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచిన విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన అలవలపాటి వీరారెడ్డి, బాలనాగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు రఘురామిరెడ్డి, జానకిరామిరెడ్డిలు నగదు ప్రోత్సాహక బహుమతులతోపాటు పాఠశాలక కంప్యూటర్‌ను వితరణగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాతలకు పాఠశాల హెడ్మాస్టర్ బాబురెడ్డి, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అగడూరు గ్రామ సర్పంచ్ గంగాదేవి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మహేశ్వరరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



పెండ్లిమర్రిలో సోషల్ ఆడిట్ నివేదికలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి

పెండ్లిమర్రి : మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రిలో బుధవారం 17వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 01-04-2022 నుంచి 31-03-2023 వరకు జరిగిన 1148 పనులకు సంబంధించి రూ.10 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. వాటిలో పండ్లతోటల పెంపకం, ఫారంపాండ్స్, డకౌట్ గుంతలు వంటి పనులు చేపట్టారు. విటిని సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనులను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, అదనపు పీడీ నాగరత్నమ్మ, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ నాగమల్లారెడ్డి, డీఆర్పీలు, సీఆర్పీలు, ప్రజలు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

కడప అర్బన్: ఉమ్మడి జిల్లాలోని రాయచోటి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు కె. నాగమల్లారెడ్డి కుటుంబానికి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ రూ. 2.10 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చెక్కును హోంగార్డు కుటుంబ సభ్యులైన కుమారులు పవనేశ్వర్, పవన్‌కుమార్‌రెడ్డి, కుమార్తె ప్రసన్నలక్ష్మిలకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ యోగక్షేమాలు, వారి విద్య గురించి విచారించారు. బాగా చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పోలీస్‌శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పోలీస్ వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని అందజేశారు.

పనుల నాణ్యతను పరిశీలించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

చెన్నూరు : ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనుల్లో పనుల నాణ్యతను పరిశీలించాలని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక మండల ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం హెడ్మాస్టర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తరుచుగా పరిశీలన చేయాలని, అలాగే పనుల నాణ్యతను పరిశీలించాలన్నారు. డీఈ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలకు కావాల్సిన సిమెంట్ ఇండెంట్ పెట్టి తెప్పిస్తానని.. వారం రోజులలో అక్కడి హెడ్మాస్టర్లు పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు వారి బ్యాంకు అకౌంట్‌లో వారి పేర్లు నమోదు చేసుకుని పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సునీత, పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉక్కు సదస్సును విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జమ్మలమడుగు : ఈనెల 18న కడపలో జరిగే ఉక్కు సదస్సును విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ బుధవారం ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ప్రభుత్వ ఐటీఐలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. మన జిల్లాలో కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసేవిధంగా ఉద్యమించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సుకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, డీవైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి రామన్న, ఉక్కు సాధన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నారాయణ తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాఘవ, సూరి, నవీన్, భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలి

కమలాపురం : ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా చేపట్టాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం మీరాపురంలో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. ఈ ఏడాది నుంచి జియో కోఆర్డినేటర్స్‌తో కలిపి ఈ-క్రాప్ బుకింగ్‌ను చేయాలన్నారు. పంట సాగు చేసిన సర్వే నెంబర్‌లోని పొలంలోకి వెళ్లిన తర్వాతనే మొబైల్ కెమెరా ఆన్ అవుతుందని, అప్పుడు మాత్రమే ఈ-క్రాప్ బుకింగ్ నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. పంట సాగు చేసిన రైతులకు ఒక రోజు ముందే సమాచారం అందించి పంట నమోదుకు వెళ్లాలన్నారు. ఒక్క రైతును కూడా మిస్ చేయకుండా పంట నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు రైతులకు అందాలంటే ఈ-క్రాప్ బుకింగ్ తప్పని సరిగా చేయాలన్నారు. చిన్న చిన్న తప్పిదాలకు కూడా అస్కారం లేకుండా పంట నమోదు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, ఎంపీఈఓ శివరంజని, రైతులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే వేగవంతం



మాట్లాడుతున్న ఈఆర్ఓ చంద్రమోహన్

కమలాపురం : నియోజకవర్గంలో ఇంటింటి సర్వే వేగవంతం అయిందని ఈఆర్ఓ చంద్ర మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల అధికారులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు చేస్తున్న ఇంటింటి సర్వే వేగవంతం అయిందన్నారు. దాదాపు 70 శాతం సర్వే పూర్తి అయిందని, 2024 జనవరి నాటికి కొత్త ఓటరు జాబితా సిద్ధం చేస్తామన్నారు. అయితే నవంబర్ 18 వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామన్నారు. ఇంటింటి సర్వేపై ఎలాంటి ఫిర్యాదులున్నా స్వీకరిస్తామన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా సలహాలు, సూచనలు ఇవ్వాలని, అలాగే సర్వేకు సహకరించాలన్నారు. సర్వే సమయంలో మరణించిన, వివాహం జరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లిన, డబుల్ ఎంట్రీ తదితర వాటిని తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పటికి స్థానికంగా సంబంధాలు కలిగి ఉండాలని, లేని పక్షంలో వారి ఓట్లు కూడా తొలగించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో అన్ని మండలాల తహసీల్దార్లు సరస్వతి, నారాయణరెడ్డి, అలీఖాన్, శంకరయ్య, ఉదయ భాస్కర్ రాజు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి వర్ధంతి వేడుకలు



మాజీ ప్రధాని వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

వేంపల్లె : మాజీ దేశ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని స్థానిక బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అటాక్ నుంచి కటక్ వరకు స్వర్ణ చతుర్భుజి ఆకారంలో అతి పెద్ద జాతీయ రహదారులు నిర్మించారన్నారు. అలాగే మారుమూల గ్రామీణ ప్రాంతాలకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రహదారులు నిర్మించడం జరిగిందన్నారు. వాజ్‌పేయి స్ఫూర్తితో ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలుపుతూ భారతదేశాన్ని విశ్వ గురువుగా మారుస్తున్న కృషి వలుడు, అలుపెరగని శ్రామికుడు మోదీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేక ఇబ్బందులు



ఫార్మసిస్టు లేక ఖాళీగా ఉన్న కుర్చీ



మందుల కోసం క్యూలో ఉన్న రోగులు

ఎర్రగుంట్ల : స్థానిక పీహెచ్‌సీలో ఫార్మసిస్టు లేకపోవడంతో రోగులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎర్రగుంట్ల పీహెచ్‌సీకి ప్రతి రోజు ఓపీ అధికంగా ఉంటుంది. వైద్యులు రాసిన మందులను రోగులు తీసుకోవడానికి ఫార్మసిస్టు లేకపోవడం వల్ల తాత్కాలికంగా అక్కడే ఉన్న అనధికార సిబ్బందితో మందులను రోగులకు పంపిణీ చేయిస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఫార్మసిస్టును డిప్యూటేషన్‌పై డీఎంహెచ్‌ఓ కార్యాలయంకు బదిలీ చేశారు. బదిలీ చేసి చాలాఏళ్లు కావస్తున్నా ఈ పీహెచ్‌సీకి ఫార్మసిస్టును వేయడంలో జిల్లా వైద్యాధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ఇక్కడ ఫార్మసిస్టును నియమించాలని రోగులు కోరుతున్నారు.

ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను సద్వినియోగం చేసుకోండి



వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

పెండ్లిమర్రి : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ నాగరాజు తెలిపారు. మండలంలోని ఉలవలపల్లె గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రోగులు వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు వినయ్‌కుమార్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓలు ప్రసాద్, రవీంద్రనాథ్, సీహెచ్‌ఓ రజిని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై విజృంభిస్తున్న తెగుళ్లు



పంటను కాల్చివేస్తున్న రైతు మహేశ్వరరెడ్డి

లింగాల : మండలంలో పుష్కలంగా భూగర్భజలాలు ఉన్నాయి. అయితే ఖరీఫ్ సీజన్‌లో పదును పాటి వర్షం కురువలేదు. ఎండలు మండిపోతున్నాయి. గాలులు విపరీతంగా వీస్తున్నాయి. పంటలకు వాతావరణం అనుకూలించలేదు. పంటలపై త్రిప్ప, మైట్, పేనుబంక, దోమ, ఎండు తెగుళ్ల విజృంభించి సాగు చేసిన పంటలు దిగుబడి అందకుండాపోతున్నాయి. విచ్చలవిడిగా పురుగు మందులు, తెగుళ్ల మందులు పిచికారి చేసినా అవి అదుపు కాకపోవడంతో రైతులు పంటలపై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. టమాట, బూడిద గుమ్మడి, అరటి, చీనీ, కళింగుర, మిరప వంటి పంటలను పండించుకోలేక రైతులు దిగాలు చెందుతున్నారు. మండలంలోని లోపట్నూతల గ్రామానికి చెందిన రైతు మహేశ్వరరెడ్డి సాగు చేసిన అరటి పంట గెలలు వేయలేదని.. పంటకు నిప్పు పెట్టి కాల్చి వేశాడు. ఇదే పరిస్థితి అన్ని పంటలపై నెలకొందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.